# మురుగు పరుగు.. కాలనీ దుర్గంధం

- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని సంబంధిత అధికారులు
- అంబర్‌పేట అడిక్‌మెట్ సెక్షన్ పరిధిలో ఇదీ పరిస్థితి..

అంబర్‌పేట, డిసెంబర్ 18: 'సార్ మా బస్తీలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగుతున్నది.. మరమ్మతులు చేయండి' అని ఎవరైనా వాటర్ వర్క్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఇదిగో వెంటనే వస్తున్నాం అంటారు. వీలుంటే మర్నాడు వెళ్తారు. అప్పటి వరకు దుర్వాసన.. రాకపోకలకు ఇబ్బందుల్ని అక్కడి వారు భరించాల్సిందే. కారణం కార్మికులు తక్కువ.. ఫిర్యాదులు ఎక్కువగా ఉండటమే. వాటర్‌వర్క్స్ అంబర్‌పేట సబ్ డివిజన్ అడిక్‌మెట్ సెక్షన్ పరిధిలో పలు కాలనీలు, బస్తీలు ఉన్నాయి. నిత్యం వివిధ ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు పొంగుతూనే ఉంటుంది. వీటిపై ఫిర్యాదులు అందుతున్నా అధికారులు సత్వరమే స్పందించి సమస్యను పరిష్కరించలేకపోతున్నారు. ఫలితంగా రోజుల తరబడి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తున్నది. దీంతో స్థానికులు అటుగా వెళ్లే వారికి ఇబ్బందులు తప్పడం లేదు.

**రోజూ 50 వరకు ఫిర్యాదులు..**

ఈ సెక్షన్ పరిధిలో నిత్యం మ్యాన్‌హోళ్లు పొంగుతున్నాయంటూ దాదాపు 50 వరకు ఫిర్యాదులు అందుతాయి. అయితే ఈ సెక్షన్ పరిధిలో ఇప్పటి వరకు నలుగురు కార్మికులు ఉండగా, ఒకరు బదిలీపై వెళ్లారు. మరొకరు ఉద్యోగ విరమణ పొందారు. ఇప్పుడు కేవలం ఇద్దరు కార్మికులు మాత్రమే ఉన్నారు. వారిపై ఓ సూపర్‌వైజర్ ఉన్నాడు. కేవలం ఇద్దరు ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చేస్తూనే ఉంటారు. వీరితో పాటు మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేసే యంత్రం ఒకటి ఉంటుంది. సాధారణంగా ఒక్కో మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేసేందుకు దాదాపు అరగంట పడుతుంది. కొన్ని చోట్లయితే గంటల సమయం కూడా అవసరమవుతుంది. ఇక యంత్రం వెళ్లడానికి వీలులేని ప్రాంతానికి కార్మికులు వెళ్లి మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో చాలా సమయం అక్కడే గడిచిపోతున్నది. దీంతో ఫిర్యాదు చేశాక మూడు రోజులైనా చాలా సమస్యలు పరిష్కారం కావడం లేదు. పని ఒత్తిడితో ఇటు కార్మికులు, దుర్వాసనతో అటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా.. ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి. పరిష్కారం అయినట్లు మళ్లీ అప్‌డేట్ ఇవ్వాలి. దీని ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఫిర్యాదుల పరిష్కారం వెంటనే జరగడం లేదు. కార్మికుల సంఖ్యను పెంచినప్పుడే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే వీలుంటుంది. ఉన్నతాధికారులు ఈ దిశగా ఆలోచిస్తే మంచిదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



బాగ్‌అంబర్‌పేట వడ్లబస్తీలో పొంగి ప్రవహిస్తున్న డ్రైనేజీ మురుగునీరు



డీడీ కాలనీలోని అడిక్‌మెట్ సెక్షన్ కార్యాలయం

### కార్మికుల సంఖ్యను పెంచండి



బాగ్‌అంబర్‌పేట డివిజన్ పరిధిలోకి వచ్చే వాటర్‌వర్క్స్ అడిక్‌మెట్ సెక్షన్ పరిధిలో డ్రైనేజీ సమస్యకు సంబంధించి ఫిర్యాదులు ఎక్కువగా ఉంటాయి. ఆన్‌లైన్ కాకుండానే బస్తీలో ఉంటే పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధుల దృష్టికి వచ్చే డ్రైనేజీ సమస్యలు కూడా ఉంటాయి. వీటిని పరిష్కరించేందుకు ప్రస్తుతం ఇద్దరు కార్మికులు మాత్రమే ఉన్నారు. ఫిర్యాదులు మాత్రం నిత్యం వంద వరకు వస్తున్నాయి. వాటిని ఇద్దరు కార్మికులు పరిష్కరించలేకపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే కార్మికులను నియమిస్తేనే డ్రైనేజీ సమస్యలు పరిష్కారమవుతాయి.

*– శ్రీరాములు ముదిరాజ్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, బాగ్‌అంబర్‌పేట*



## షాజహాన్ కాలనీలో సీవరేజీ లైన్

కార్వాన్ నియోజకవర్గం టోలిచౌకి డివిజన్ షాజహాన్ కాలనీలో సీవరేజీ ఆధునీకరణ పనులను జలమండలి అధికారులు చేపట్టారు. ఈ పనులను బుధవారం జలమండలి ప్రాజెక్ట్ అధికారులతో కలిసి ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి మహ్మద్ హరూన్ ఫర్హాన్ పర్యవేక్షించారు. *–మెహిదీపట్నం,డిసెంబర్ 18*

## మోదీ హయాంలో బీసీలకు అన్యాయం : జాతీయ బీసీదళ్



మాట్లాడుతున్న జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి,తదితరులు

కాచిగూడ, డిసెంబర్ 18: బీసీల ఆకాంక్షలను నెరవేర్చడంలో మోదీ ప్రభుత్వం వైఫల్యం చెందిందని, దేశ ప్రజలు బీజేపీని తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి హెచ్చరించారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీల మనోభావాలను గ్రహించి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో కులగణన తీర్మానం చేసి కేంద్రానికి పంపించి తన నిజాయితీని నిరూపించుకున్నాడని గుర్తుజేశారు. బీసీల భావితరాల కోసం కేంద్ర ప్రభుత్వం జనాభా గణనలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయమే జరుగుతుందని, బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో న్యాయం జరగడంలేదని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం బీసీల పట్ల వ్యతిరేక వైఖరి అవలంభిస్తుందని, బీసీలంతా ఏకమై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీదళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లు

తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్.విక్రమ్‌కుమార్ ఆధ్వర్యంలో గగన్‌మహల్ మైదానంలో జరుగుతున్న 11వ బి.స్వామినాథమ్ క్రికెట్ టోర్నమెంట్‌లలో భాగంగా రెండవరోజు బుధవారం ఐ.జి రిజిస్ట్రేషన్, హైదరాబాద్ యూత్ ఫోర్స్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సెంట్రల్ లైబ్రరీ, జిల్లా విద్యాశాఖ కార్యాలయం, ఎక్సైజ్ ప్రొహిబిషన్ జట్లు పోటీలో విజయం సాధించగా.. ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం హుస్సేనీ, హైదరాబాద్ అధ్యక్షులు ఎం.బి కృష్ణయాదవ్ తదితర యూనియన్ సభ్యులు పాల్గొని అభినందించారు. – (సుల్తాన్‌బజార్)





ప్రమాణస్వీకారం చేస్తున్న పగిడిమర్రి హరి

## రాష్ట్ర పద్మశాలి సంఘం అసోసియేట్ అధ్యక్షుడిగా హరి

అంబర్‌పేట, డిసెంబర్ 18: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అసోసియేట్ అధ్యక్షునిగా పగిడిమర్రి హరి నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ ఆయనను నియమించారు. సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో జరిగిన ప్రమాణ స్వీరారోత్సవంలో పగిడిమర్రి హరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ తనకు బాధ్యతలు అప్పగించిన సంఘం పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

## మల్లేపల్లిలో నీటి సమస్యలు పరిష్కరించండి



నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్‌లో నీటి సమస్యలు పరిష్కరించడానికి జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్ అన్నారు. బుధవారం జలమండలి మేనేజర్ నదీంను జాఫర్‌ఖాన్ కలిసి నీటి సమస్యలపై చర్చించారు. ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ ఆదేశాలతో మల్లేపల్లి డివిజన్‌లో అభివృద్ధికి కృషి చేస్తున్నామని జాఫర్‌ఖాన్ తెలిపారు. *– మెహిదీపట్నం, డిసెంబర్ 18*

## విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న సిస్టర్ గాయత్రి, తదితరులు

కాచిగూడ, డిసెంబర్ 18: విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకుంటూ నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సిస్టర్ గాయత్రి అన్నారు. బుధవారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'హార్ట్‌ఫుల్‌నెస్ ఎక్స్‌పీరియన్స్ ఇన్ లైఫ్'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సిస్టర్స్ గాయత్రి, వేణుమాధవి, విమల, ఉమా, రాజగోపాల్ మాట్లాడుతూ.. జీవిత నైపుణ్యాలు, హార్ట్‌ఫుల్‌నెస్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగినప్పుడే విజయం సాధిస్తారన్నారు. ఈ కార్యకమంలో కళాశాల ప్రిన్సిపాల్ చిరంజీవి, డాక్టర్ బి.లక్ష్మయ్య గంగపుత్ర, వి.ప్రసాద్‌రావు, గీతాబాయి, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



## యువత బస్తీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

బస్తీల అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని లంగర్‌హౌస్ గొల్లబస్తీకి చెందిన కుంచారపు జగన్నాథం అన్నారు. బుధవారం ఆయన ఎయిర్‌ఫోర్స్‌లో రిటైర్ అయిన సందర్భంగా లంగర్‌హౌస్‌కు చెందిన పలువురు యువకులు జగన్నాథాన్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇంద్రసేనారెడ్డి, వినేశ్ సింగ్, స్రవంత్, కోయల్‌కార్ గోవింద్‌రాజ్ తదితరులుపాల్గొన్నారు. *– మెహిదీపట్నం, డిసెంబర్ 18*

## 20న కథల లోగిలి ఆవిష్కరణ

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 18: లేఖిని రచయిత్రుల వేదిక ఆధ్వర్యంలో 74 మంది రచయిత్రుల కథాసంకలనాలతో ప్రచురించిన కథల లోగిలి చిక్కడపల్లిలోని త్యాగరాయగాన సభలోని కళాసుబ్బారావు వేదికపై ఈనెల 20వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆవిష్కరణ జరుగుతుందని లేఖిని సంస్థ అధ్యక్షురాలు అత్తలూరి విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 74 కథలతో రూపొందిన కథా సంకలనాన్ని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కే.వీ.రమణాచారి ఆవిష్కరిస్తారని తెలిపారు. ప్రముఖ రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి అధ్యక్షతన జరగనున్న ఈ సభలో ప్రముఖ నృత్య గురువు డాక్టర్ ఆర్.ప్రసన్న రాణి, సాహితీవేత్తలు డాక్టర్ ఓలేటి పార్వతీశం, రచయిత్రులు కందాళ ఉషారాణి తదితర సాహితీవేత్తలు పాల్గొంటారని ఆమె తెలిపారు.

## బస్తీ దవాఖానను పరిశీలించిన కార్పొరేటర్



అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్‌లోని బస్తీ దవాఖానను బుధవారం స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. ప్రతిరోజూ దవాఖానకు వస్తున్న రోగుల వివరాలతోపాటు సరిపడా మందులు ఉన్నాయా? అని అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ వెంట బీఆర్‌ఎస్ నాయకులు లవంగు ఆంజనేయులు, మల్లేశ్‌యాదవ్, మహేశ్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు. *– గోల్నాక, డిసెంబర్ 18*

## పశు సంపదను కాపాడుకోవాలి

**మాజీ ఉపకులపతి డాక్టర్ హఫీజ్**



*పంజాబ్ శాస్త్రవేత్తకు ఫెల్లోషిప్ అవార్డు అందజేస్తున్న మాజీ వీసీ హఫీజ్ ,రిజిస్ట్రార్ శరత్‌చంద్ర*

వ్యవసాయ యూనివర్సిటీ ,డిసెంబర్ 18: దేశ వ్యాప్తంగా పశుసంపదను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణగా పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని శ్రీ వెంకటేశ్వర మాజీ ఉప కులపతి డా.హఫీజ్ సూచించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో 33వ నేషనల్ కాంగ్రెస్ నేషనల్ సింపోజియం ఆఫ్ పారాసిటాలజీ అనే అంశంపై రెండో రోజు చర్చ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవి జంతువులు, ఫౌల్ట్రీ, జంతువుల నుంచి వ్యక్తులకు వ్యాపించే వ్యాధులపై ప్రభావం చూపే పరాన్న జీవుల నియంత్రణ, చికిత్సపై శాస్త్రీయ సదస్సు నిర్వహించారు. పరాన్న జీవుల ద్వారా జంతువులకు, వ్యక్తులకు వ్యాపించే వ్యాధులను నియంత్రించడానికి ఆధునిక పరిశోధనలపై చర్చ జరిగిందన్నారు. వివిధ విభాగాలలో అపూర్వ ప్రతిభ కనబర్చిన అధ్యాపకులు , విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాకల్టీ డీన్, సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి డా. ఉదయ కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ శరత్ చంద్ర , కళాశాల అసోసియేట్ డీన్ డా. మాధురి, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ వెటర్నరీ పార్సిటాలజీ అధ్యక్షులు డా శంకరణ్, కార్యదర్శి డా. అనిష్ యాదవ్, విశ్వవిద్యాలయ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా. హరికృష్ణ, విస్తరణ సంచాలకులు డా. కిషన్ కుమార్,దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల ఆశాఖ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



ఇంటీరియర్ ప్లాంట్స్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ జీఎస్.గోపాల్‌రెడ్డి, కరాటే విద్యార్థులు

# పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

కాచిగూడ, డిసెంబర్ 18: రాబోయే తరాలకు పచ్చదనాన్ని ఇవ్వడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ జీఎస్.గోపాల్‌రెడ్డి అన్నారు. జీవీఆర్ కరాటే అకాడమీ ప్రాంగణంలో కరాటే విద్యార్థులకు బుధవారం ఇంటీరియర్ ప్లాంట్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జీఎస్.గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని, రాష్ట్రం సుభిక్షంగా ఉండలాంటే కాలుష్య రహిత ప్రకృతిని అందించేందుకు పచ్చని చెట్లు ఎంతగానో ఉపయోగ పడుతాయన్నారు. ప్రజలు స్వచ్ఛమైన వాతావరణంలో గాలి పిల్చి ఆరోగ్యంగా జీవించేందుకు ప్రతిఒక్కరూ తప్పనిసారిగా ఇంట్లో మొక్కలు నాటాలని సూచించారు. ప్రతిఒక్కరూ ఇంటికో మొక్కను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు అమృతరెడ్డి, గణ సంతోషినిరెడ్డి, అనగ, వెంకట్‌రెడ్డి,విద్యార్థులు పాల్గొన్నారు.



కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్ కార్పొరేటర్ కుమారుడు గౌసుద్దీన్ సిద్ధికీ వివాహానికి కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్‌లు హాజరైన వరుడికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం కార్పొరేటర్ల ప్రతినిధులు వజీ ఉజ్జమాసిద్ధికీ, మహ్మద్ హరూన్ ఫర్హాన్ తదితరులు పాల్గొన్నారు. *– మెహిదీపట్నం, డిసెంబర్ 18*

## పాఠశాల వద్ద పొగాకు ఉత్పత్తుల విక్రయం

**వ్యక్తిపై కేసు నమోదు**

ఖైరతాబాద్: టీ స్టాల్ ముసుగులో ఓ వ్యక్తి ప్రభుత్వ పాఠశాల సమీపంలో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు వాటిని స్వాధీనం చేసుకొని నిర్వహకుడిపై కేసు నమోదు చేశారు. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాగుట్టలోని బాలాపుర బస్తీలో ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల సమీపంలో దొంగల శ్రీనివాస్ (39) టీ స్టాల్ నిర్వహిస్తున్నాడు. టీతో పాటు సిగరేట్లు, గుట్కా, పాన్ మషాలాలు, ఇతర పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్నాడు. ప్రభుత్వ నిబంధనల మేరకు పాఠశాలకు వంద గజాల పరిధిలో ఎవరూ మత్తు పదార్థాలను విక్రయించవద్దు. కాని నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ పాఠశాల వద్దనే శ్రీను ఈ వ్యాపారం నిర్వహిస్తుండడంతో సమాచారతో పోలీసులు దాడి చేసి అతడి వద్ద ఉన్న వివిధ బ్రాండ్ల సిగరేట్ డబ్బాలు, గుట్కా, పాన్ మషాలాల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బడి వద్దే.. సిగరెట్ల దుకాణం

వెంగళరావునగర్, డిసెంబర్ 18 :నిబంధనలకు విరుద్ధంగా బడి వద్దే నిర్వహించే సిగరెట్ల దుకాణంపై మధురానగర్ పోలీసులు దాడులు నిర్వహించారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం..కార్మికనగర్ ప్రభుత్వ పాఠశాలకు 100 మీటర్ల లోపు రెట్రో డ్రైవ్ పేరుతో ఎం.డి.ముస్తఫా అనే వ్యక్తి పాన్ షాపును నిర్వహిస్తూ సిగరెట్లను విక్రయిస్తున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా సిగరెట్లు విక్రయిస్తుండడంతో షాప్‌పై పోలీసులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించి రూ.10వేలు విలువ చేసే సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## లంగర్‌హౌస్ కట్టమైసమ్మ ఆలయం వద్ద పూజలు

కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ చెరువుపై ఉన్న కట్టమైసమ్మ ఆలయం పునర్నిర్మాణానికి బుధవారం బస్తీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టకు ముందు హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, నాయకులు కృష్ణాయాదవ్, రవీందర్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, శివశంకర్, బుజిలి మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ బోగి పరమేశ్ కుమార్, అరవింద్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ.. లంగర్‌హౌస్ బస్తీలో అందరి సహకారంతో ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. *– మెహిదీపట్నం, డిసెంబర్ 18*

## 23న వ్యాస రచన పోటీలు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 18: తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రతన్ టాటా జయంతిని పురస్కరించుకుని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో గల సరోజిని నాయుడు వనత మహావిద్యాలయం ఆవరణలోని ఎంబీఏ బ్లాక్‌లో ఈ నెల 23వ తేదీన తెలుగు, ఆంగ్లం, హిందీ, ఉర్దూ భాషల్లో వివిధ కళాశాలల్లో ఎంబీఏ చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. Rathan TATA A Visionary Leader Shaping Philanthropy and Business in India అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరుగుతాయని వెల్లడించారు. వివరాలకు 99488 82604 సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు ఈనెల28న ఉదయం 10 గంటలకు అబిడ్స్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు హాలులో బహుమతులు, సర్టిఫికెట్‌లు, మెడల్స్ ప్రదానం చేస్తామన్నారు.

### ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి



సుల్తాన్‌బజార్, డిసెంబర్ 18: గుర్తు తెలియని ఓ వ్యక్తి ఫుట్‌పాత్‌పై మరణించిన సంఘటన సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఎస్సై మధుసూదన్ తెలిపిన ప్రకారం.. స్టేషన్ పరిధిలోని చాదర్‌ఘాట్ విక్టరీప్లేగ్రౌండ్ సమీపంలోని సాయిబాబా ఆలయం వద్ద సంచరించే సుమారు 35–40 ఏండ్ల వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినట్లు సమాచారం అందింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖా మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. తెలుపు రంగు షర్టు, నీలం రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని వెల్లడించారు. వివరాలకు 87126 60512, 87126 61264 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.



## అయ్యప్పస్వామి మహాపడిపూజ

కాచిగూడ, డిసెంబర్ 18: రాఘవ,ఎన్.కిషోర్ గురుస్వామి ఆధ్వర్యంలో కాచిగూడ నింబోలిఅడ్డాలో బుధవారం శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి హోమంతో పూజ కార్యక్రమంతో ప్రారంభమై పడిపూజ కార్యక్రమంతో ముగిసింది. అయ్యప్పస్వాముల నామస్మరణలతో నింబోలిఅడ్డా ప్రాంతమంతా భక్తి మయమయింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ ఉమా హాజరై అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, గురుస్వాములు గులాబ్ శ్రీనివాస్, టింకు, శ్రీకాంత్, లక్ష్మణ్, భీంరాజ్, సంతోశ్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.